www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily | శుక్రవారం 21,ఆగస్టు, 2026

కోర్టు నిర్ణయానికి వ్యతిరేకంగా అధికారులు తీరు ఉందా..?

ఇసుక వివాదం పై అంటీ ముట్టనట్లు ఎందుకు..?

రాజకీయ ఒత్తిళ్ళ నేపథ్యంలో రాజ్యాంగం పట్ల పరిహాసమా..?

కోర్టు నిర్ణయాల అమలుపై పర్యవేక్షణ లేదా..?

గోదావరిలో పూడికతీతపై మరో వివాదం

కోర్టు స్టే ఉన్నా తవ్వకాలు ఆగడం లేదంటూ పిటిషనర్ ఫిర్యాదు

ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయస్థానం

ఫోటోలను దాఖలు చేయాలంటూ ఆదేశాలు

ములుగు జిల్లాలో ఏం జరుగుతుంది..?

-ఉన్నతాధికారులు ఉన్నట్టా..?లేనట్టా..?

కలెక్టర్ గారూ... కోర్టు ఉత్తర్వులు ధిక్కరిస్తున్నారంట

మీరు మౌనంగా ఉంటే ఎలా..?

పట్టించుకోకపోతే పరిహాసం చేసినట్లు కాదా..?

# ధిక్కారపు ఉచ్చు



6 లో..



ఫైల్ ఫోటోలు



గోదావరి నదిలో పూడికతీత పనులకు సంబంధించి కోర్టుఇచ్చిన ఉత్తర్వులు అమలకు నోచుకోవడం లేదంటూ సాక్షాత్తు కోర్టుకే పిటిషనర్ నేరుగా ఫిర్యాదు చేయడం సంచలనంగా మారింది. తెలంగాణలోని ములుగు జిల్లాలో అక్రమంగా గోదావరి నదిలో పూడికతీత పనులు చేస్తున్నారని కోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో తవ్వకాలు నిలుపుదల చేయాలంటూ కోర్టు కొద్ది రోజుల క్రితమే స్టే ఇచ్చింది. అయితే ఆ స్టేను అమలుపరిచే విషయంలో ములుగు జిల్లా అధికారులు అంటీ ముట్ట నట్లుగా వ్యవహ రిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. స్టే వచ్చాక కూడా యధావిధిగా తవ్వకాలు,ఇసుక రవాణా సాగిపోతుందంటూ ఆరోపణలు వస్తున్న సమయంలోనే సాక్షాత్తు పిటిషనర్ సైతం తాజాగా కోర్టుకు ఈ విషయాన్ని నేరుగా విన్నవించడం పట్ల కోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడం ములుగు జిల్లా అధికారుల ప్రశ్నార్ధకమైన పనితీరుకు అద్దం పడుతుంది

- భద్రాద్రి న్యూ స్ ములుగు జిల్లా:

## పెండింగ్ భూసేకరణను
# వేగవంతంగా పూర్తి చేయాలి

రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

నీటిపారుదల ప్రాజెక్టుల పనులకు ఆటంకం లేకుండా చర్యలు

పరిహారం, పునరావాస ప్రక్రియలను సత్వరం పూర్తి చేయాలి

పెండింగ్ భూసేకరణకు రూ.2,800 కోట్ల విడుదలకు చర్యలు

కొత్త ఆయకట్టు సృష్టించేలా భూసేకరణ పనులు పూర్తి చేయాలి



2లో





3లో

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై
# కఠిన చర్యలు తీసుకోవాలి

**ఎన్డీపీఎస్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

**అశ్వారావుపేట,ఆగస్టు 21 (భద్రాద్రిన్యూస్ ):** వార్షిక తనిఖీలలో భాగంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శుక్రవారం అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పాల్వంచ డీఎస్పీ ఆర్. సతీష్ కుమార్ జిల్లా ఎస్పీకి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న..

# పెండింగ్ భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలి

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 21 (భద్రాద్రిన్యూస్ ):-** జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, పరిహారం చెల్లింపు, పునరావాస ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.

శుక్రవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో నీటిపారుదల ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్ భూసేకరణ, పరిహారం చెల్లింపు, పునరావాసం తదితర అంశాలపై నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో కలిసి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఐడీఓసీ కార్యాలయంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నీటిపారుదల ప్రాజెక్టుల పనులు సకాలంలో పూర్తయ్యేందుకు పెండింగ్ భూసేకరణను పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పెండింగ్ భూసేకరణ కోసం ప్రభుత్వం రూ.2,800 కోట్లను విడుదల చేసేందుకు చర్యలు చేపట్టిందని, ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపారని అన్నారు .

కొత్త ఆయకట్టు సృష్టించేందుకు వీలుగా పెండింగ్ భూసేకరణ, పునరావాస పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి సూచించారు. భూసేకరణకు అవసరమైన నిధులు అందుబాటులో ఉన్నందున ఎక్కడా జాప్యం లేకుండా ప్రక్రియను పూర్తి చేసి, ప్రాజెక్టుల పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ , జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, పరిహారం చెల్లింపు, పునరావాసానికి సంబంధించిన ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భూసేకరణకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కరించాలని సూచించారు.

రైతులకు చెల్లించాల్సిన పరిహారం, పునరావాసానికి సంబంధించిన అంశాలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని, భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల పనులు సజావుగా కొనసాగేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఇరిగేషన్ మరియు భూసేకరణ అధికారులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భూసేకరణ ప్రక్రియలో రైతులతో సమన్వయం చేసుకోవాలి





**జిల్లా కలెక్టర్ అంకిత్**

**వారం రోజుల్లోగా భూ సర్వే ప్రక్రియ పూర్తి చేయాలి**

**భద్రాద్రి కొత్తగూడెం ,ఆగస్టు 21 (భద్రాద్రిన్యూస్ ):-**

సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ, భూ సర్వే పనులను వేగవంతం చేసి నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని హేమచంద్రపురం, కారుకొండ రెవెన్యూ గ్రామాల పరిధిలో జరుగుతున్న భూ సర్వే పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా సర్వే జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్, భూముల వివరాలు, సర్వే పురోగతి, డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణానికి సంబంధించిన అలైన్‌మెంట్ తదితర అంశాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. హేమచంద్రపురం, కారుకొండ గ్రామాల పరిధిలో సుమారు 191.25 ఎకరాల భూమిని సర్వే చేయాల్సి ఉండగా, సుమారు 7.50 కిలోమీటర్ల మేర డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

భూ సర్వే పనుల పురోగతిని అడిగి తెలుసుకున్న కలెక్టర్‌కు, ఇప్పటివరకు సుమారు 6 ఎకరాల మేర భూ సర్వే పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన భూములకు సంబంధించిన సర్వేను వేగవంతంగా పూర్తి చేసేందుకు చేపడుతున్న చర్యలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా డిస్ట్రిబ్యూటరీ కెనాల్ ప్రతిపాదిత అలైన్‌మెంట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్, సర్వే ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

భూ సర్వే పనులను ప్రతిరోజూ ఉదయం 8 గంటలకే ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వే బృందాలు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన సిబ్బందిని సమన్వయం చేసుకొని పనులను నిరంతరం కొనసాగించాలని సూచించారు. వారం రోజుల్లోగా మొత్తం భూ సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. సర్వే పనుల పురోగతిని ప్రతిరోజూ సమీక్షిస్తూ, నిర్దేశిత లక్ష్యాన్ని సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

భూసేకరణ ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. సర్వే సమయంలో భూముల హద్దులు, విస్తీర్ణం, ఇతర సంబంధిత వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని తెలిపారు. భూ సర్వేకు సంబంధించి రైతులకు ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఉంటే వాటిని క్షేత్రస్థాయిలోనే పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అనంతరం క్షేత్రస్థాయిలో రైతులతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. భూ సర్వే ప్రక్రియకు సహకరించాలని, అధికారులు నిర్వహించే సర్వే సమయంలో అవసరమైన సమాచారం అందించాలని రైతులను కోరారు. ప్రాజెక్టు పనుల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని భూసేకరణ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా అధికారులకు సహకరించాలని సూచించారు.

సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా సాగునీటి వసతుల విస్తరణకు సంబంధించిన పనుల్లో భూసేకరణ, భూ సర్వే కీలకమైన అంశాలని కలెక్టర్ తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పరం సమన్వయం చేసుకుంటూ పనులను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట కొత్తగూడెం ఆర్డీవో మధు, లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ శిరీష, సర్వే అధికారులు, ఇరిగేషన్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పీహెచ్సీ, ల్యాబ్ ను పరిశీలించిన సెంట్రల్ టీం

**ల్యాబ్ రికార్డులను పరిశీలించిన సెంట్రల్ టీం**

**జ్వర కేసులగుర్తింపు, చికిత్సపై సమీక్ష**

**భద్రాద్రి న్యూస్ ఆగస్టు 21 వెంకటాపురం - నూగూరు:**



ఎదిరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ల్యాబ్ ను మలేరియా సెంట్రల్ టీం ప్రతినిధి లక్ష్మణ్ శుక్రవారం పరిశీలించారు. అశోక్, సురేష్ ఆధ్వర్యంలో పీహెచ్సీ వైద్యాధికారి డా. యు.జస్టస్ గౌడ్ తో సమావేశమయ్యారు. మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధుల నియంత్రణ, గ్రామాల్లో వైద్య శిబిరాల నిర్వహణపై సమీక్షించారు. అనంతరం ల్యాబ్ ను పరిశీలించారు. ల్యాబ్ టెక్నీషియన్ గణేష్ పరీక్షల వివరాలను తెలిపారు. రికార్డులను పరిశీలించి ల్యాబ్ నిర్వహణపై సూచనలు జారీ చేశారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, కేసులను సకాలంలో గుర్తించి రక్త నమూనాలు సేకరించాలని సూచించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమతెరలు వాడాలని, ఆశాలు ఇంటింటి సర్వే చేసి వారానికి రెండుసార్లు డ్రైడే పాటించాలని, జ్వరం వస్తే వెంటనే ఆస్పత్రికి రావాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, అశోక్, సురేష్, డా. జస్టస్ గౌడ్, ఎస్.యం.ఓ నరసింహారావు, కుప్పిలి కోటిరెడ్డి, గణేష్, రాఘవులు, భాస్కర్, పీహెచ్సీ సిబ్బంది పాల్గొన్నారు.

# ద్వారకానగర్‌లో వైభవంగా శ్రీ వరలక్ష్మీ వ్రత వేడుకలు





**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 21 (భద్రాద్రిన్యూస్ ):-**

నగరంలోని ద్వారకానగర్, ఓం రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ వరలక్ష్మీ వ్రత వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, కోలాహలంగా జరిగాయి. అపార్ట్‌మెంట్ నివాసి వోలేటి మాధవి గారి ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కుటుంబ పెద్దలు, మహిళలు, ముత్తైదువులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పూజ అనంతరం ముత్తైదువులకు సంప్రదాయబద్ధంగా వాయనాలు, తాంబూలాలు సమర్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.

భక్తిగీతాలు, మంగళహారతులతో ఓం రెసిడెన్సీ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో విలసిల్లింది. ఈ ప్రాంతంలో జరిగిన వరలక్ష్మీ వ్రత వేడుకలలో ఇది ఒక ముఖ్య ఘట్టంగా నిలిచిందని స్థానికులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ వాసులు, కాలనీ ప్రముఖులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# హక్కుల పరిరక్షణకు దండయాత్ర

**భద్రాచలంలో లా కాలేజీ ఏర్పాటుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలి**

**5వ షెడ్యూల్ లో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి.**



**వెంకటాపురం, భద్రాద్రి న్యూస్, ఆగస్టు 21,**

వెంకటాపురం మండల కేంద్రంలోని గెస్ట్ హౌస్ ఆవరణలో శుక్రవారం జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి దొర మాట్లాడుతూ భూమి, నీరు, అడవిపై ఆదివాసీల హక్కులను కాపాడాలని, పీసా చట్టం ప్రకారం గ్రామసభలు నిర్వహించాలని, కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులను అమలు చేయాలని కోరారు. హక్కుల పరిరక్షణ కోసం త్వరలో 100 రోజుల దండయాత్ర చేపడతామని తెలిపారు. సమావేశంలో పదం సుధాకర్, సురేష్, రాజబాబు, సత్యనారాయణ సూర్యం తదితరులు పాల్గొన్నారు

# ఇనుప చువ్వల దొంగతనం కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

**దొంగిలించిన ఇనుప చువ్వలు, ఆటో స్వాధీనం**

**ఎన్కూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఇనుప చువ్వల దొంగతనం కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్**



**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 21 (భద్రాద్రిన్యూస్ ):-**

ఎన్కూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని నాచారం గ్రామ శివారులో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి వద్ద ఇనుప చువ్వలు దొంగతనం జరిగినట్లు ఈనెల 19న మధ్యాహ్నం అందిన ఫిర్యాదు మేరకు ఎన్కూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడం జరిగింది.
దర్యాప్తులో భాగంగా శుక్రవారం దొంగిలించిన ఇనుప చువ్వలను ఆటోలో తరలిస్తున్న ఇద్దరు నిందితులను పోలీసులు పట్టుకున్నారు. నిందితులను చింతల సాయి గణేష్ (22), బేతాలపాడు గ్రామం మరియు కిల్లి వెంకటేష్ (25), స్వగ్రామం ఇబ్రాహింబాదు, శ్రీకాకుళం జిల్లాగా గుర్తించడం జరిగింది.
నిందితుల వద్ద నుంచి దొంగిలించిన సుమారు 50 కిలోల ఇనుప చువ్వల ముక్కలు మరియు వాటిని తరలించేందుకు ఉపయోగించిన ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
విచారణలో నిందితులు నాచారం బ్రిడ్జి వద్ద ఇనుప చువ్వలను దొంగిలించినట్లు వెల్లడించారు. కేసుకు సంబంధించి తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

# గురువు గౌరవం కోసం గళమెత్తిన త్రివేణి

**హత్యను ఖండిస్తూ నిరసన ర్యాలీ**

**ఖమ్మం ప్రతినిధి , ఆగస్టు 21 (భద్రాద్రిన్యూస్ ):-**

నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి నాగార్జున పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ కె. రూపారెడ్డి మేడం హత్యను ఖండిస్తూ, ఆమె మృతికి సంతాపం తెలియజేస్తూ త్రివేణి స్కూల్స్, ఖమ్మం శాఖ ఉపాధ్యాయులు నిరసన ర్యాలీలో పాల్గొన్నారు. టి.ఆర్.ఎస్.ఎం.ఎ ఖమ్మం ఆధ్వర్యంలో పెవిలియన్ గ్రౌండ్స్ నుంచి జెడ్పీ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. నల్ల రిబ్బన్లు ధరించి, ప్లకార్డులు, బ్యానర్లతో పాల్గొన్న ఉపాధ్యాయులు మత్తు పదార్థాల నియంత్రణ, గురువుల రక్షణ, పాఠశాలల్లో సురక్షిత వాతావరణం కల్పించాలని నినదించారు.రూపారెడ్డి మేడం మృతికి త్రివేణి స్కూల్ యాజమాన్యం, డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి, ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్, ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రగాఢ సంతాపం తెలిపారు. పాఠశాలల పరిసరాల్లో మత్తు పదార్థాల సరఫరాను అరికట్టి, గురువులు, విద్యార్థులకు భద్రమైన విద్యా వాతావరణం కల్పించాలని కోరారు.




# కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి





**డిసెంబర్ నాటికి పనులు పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలి**

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 21 (భద్రాద్రిన్యూస్ ):**

పాల్వంచ మండలంలో నిర్మిస్తున్న కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్, పనులను మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తిచేసేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న వివిధ బ్లాకులను కలెక్టర్ పరిశీలించారు. బాయ్స్ హాస్టల్, గర్ల్స్ హాస్టల్, తరగతి గదులు, ల్యాబొరేటరీ బ్లాక్ తదితర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఆయా పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను నిర్దేశిత ప్రమాణాల మేరకు నాణ్యతతో చేపట్టడంతో పాటు, ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.
ప్రస్తుతం వైద్య కళాశాల ప్రధాన భవనాలు, హాస్టల్ భవనాలు,ఆసుపత్రి,తరగతి గదులు, ల్యాబొరేటరీ బ్లాక్ తదితర నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. బాయ్స్, గర్ల్స్ హాస్టల్ నిర్మాణ పనులు దాదాపు తుది దశకు చేరుకున్నాయని, మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు.
వైద్య కళాశాల నిర్మాణానికి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించిన కలెక్టర్, కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న అంతర్గత రహదారులు, లైబ్రరీ, తరగతి గదులు, ల్యాబొరేటరీలు, విద్యార్థుల వసతి తదితర మౌలిక సదుపాయాలపై అధికారులను వివరంగా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా నిర్మాణ పనులను చేపట్టాలని సూచించారు.
కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రతి సంవత్సరం 150 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుతం నర్సింగ్ కళాశాలలో బోధన కొనసాగుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నర్సింగ్ కళాశాలలో విద్యార్థులకు అందుతున్న బోధన, వసతి, తరగతి గదులు, ల్యాబొరేటరీలు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలపై కలెక్టర్ ఆరా తీశారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు సమకూరుతున్నాయా, ఇంకా ఏవైనా అదనపు వసతులు అవసరమా అనే అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణం జిల్లాకు అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టు అని అన్నారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి, ప్రతి పనికి నిర్దిష్ట కాలపరిమితిని నిర్దేశించుకుని ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. బాయ్స్ హాస్టల్, గర్ల్స్ హాస్టల్ నిర్మాణ పనులను నెల రోజుల్లోగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు.
మిగిలిన నిర్మాణ పనులను కూడా డిసెంబర్ నాటికి పూర్తిచేసేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.
సుమారు 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులు, బోధనా సిబ్బంది, వైద్య సిబ్బందికి అవసరమైన అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పనులు చేపట్టాలని స్పష్టం చేశారు.
ఈ పరిశీలనలో సంబంధిత వైద్య, ఇంజినీరింగ్, నిర్మాణ శాఖల అధికారులు, నర్సింగ్ కళాశాల అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**మొదటి పేజీ తరువాయి**



సిబ్బంది నుంచి జిల్లా ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తించే సిబ్బంది ప్రభుత్వ కిట్ ఆర్టికల్స్ ను తనిఖీ చేశారు, పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి, అధికారులకు మరియు సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌ను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా వ్యవహరిస్తూ, వారి సమస్యలకు సత్వర న్యాయం అందేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని తెలిపారు.
పోలీస్ స్టేషన్‌లో వివిధ వర్టికల్స్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరును ఒక్కొక్కరిగా అడిగి తెలుసుకున్నారు.

పేకాట, కోడిపందాలు, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచి, కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన దొంగతనం కేసుల వివరాలను అడిగి తెలుసుకొని, పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించడంతో పాటు, దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను గుర్తించి అరెస్ట్ చేయాలని సూచించారు. చోరీకి గురైన ఆస్తి రికవరీపై ప్రత్యేక దృష్టి సారిస్తూ దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశించారు.
మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.
సీసీటీఎన్ఎస్ 2.0లో కేసుల నమోదు, దర్యాప్తు వివరాలను ఎప్పటికప్పుడు సక్రమంగా అప్‌డేట్ చేయాలని, ఈ-సాక్ష్య, నాట్ గ్రిడ్, గాండీవ వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా నిరంతరం సైబర్ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో నిరంతరం సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, డయల్--112కు ఫోన్ రాగానే సంఘటనా స్థలానికి వేగంగా చేరుకుని బాధితులకు తక్షణ సహాయం అందించాలని సూచించారు.
పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డీఎస్పీ ఆర్. సతీష్ కుమార్, సీఐ నాగరాజు, ఎస్సైలు యయాతి రాజు, రాజేష్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు వైరాలో ఎంప్లాయ్‌మెంట్ కార్డు రిజిస్ట్రేషన్ మేళా,కెరీర్ గైడెన్స్ కార్యక్రమం

**జిల్లా ఉపాధి కల్పన అధికారిణి మాధవి**

**విద్యార్థులు, నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

**ఖమ్మం ప్రతినిధి , ఆగస్టు-21 (భద్రాద్రిన్యూస్ ):**
వైరా, పరిసర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, నిరుద్యోగ యువతకు సౌకర్యంగా ఉండేందుకు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, ఖమ్మం ఆధ్వర్యంలో నేడు (ఆగస్టు 22న) ఉదయం 11.00 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల, వైరాలో ఎంప్లాయ్‌మెంట్ కార్డు రిజిస్ట్రేషన్ మేళా, కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారిణి యన్. మాధవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఎంప్లాయ్‌మెంట్ కార్డు కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆన్‌లైన్ విధానంలోనే కొనసాగుతున్నప్పటికీ, వైరా, పరిసర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, నిరుద్యోగ యువతకు సౌకర్యంగా ఉండేందుకు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రంతో వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నేరుగా హాజరై మాన్యువల్‌గా దరఖాస్తు ఫారం నింపవచ్చని తెలిపారు. అనంతరం అభ్యర్థుల వివరాలను ఉపాధి కల్పన కార్యాలయం ద్వారా నమోదు చేసి, ఎంప్లాయ్‌మెంట్ కార్డు పొందే విధంగా అవసరమైన సహాయం అందించనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ అనంతరం ఉన్నత విద్యలో ఎలాంటి కోర్సులను ఎంచుకోవాలి, వివిధ కెరీర్ అవకాశాలు, భవిష్యత్ ప్రణాళికలు, ఉద్యోగ మేళాలు, శిక్షణా కార్యక్రమాలు తదితర అంశాలపై విద్యార్థులకు ప్రత్యేకంగా కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారిణి తెలిపారు. కావున వైరా, పరిసర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని ఎంప్లాయ్‌మెంట్ కార్డు రిజిస్ట్రేషన్‌తో పాటు కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారిణి మాధవి కోరారు.

# చోరీ కేసుల్లో నిందితుడి అరెస్ట్

**రూ.2.10 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం:వైరా సిఐలి**






**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 21 (భద్రాద్రిన్యూస్ ):-**
తల్లాడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రెండు ఇంటి చోరీ కేసులను తల్లాడ పోలీసులు ఛేదించారని, ఈ కేసుల్లో నిందితుడిని అరెస్ట్ చేసి, చోరీకి గురైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు వైరా సిఐ వెంకటప్రసాద్ తెలిపారు.

రెండు ఇంటి చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్న జంగాల స్వరూప్ కుమార్ ఏ శాంతి స్వరూప్ ఏ వినయ్ కుమార్, వయస్సు 41 సం,,ను శుక్రవారం ఉదయం తల్లాడ బస్ స్టాండ్ వద్ద పోలీసులు అరెస్ట్ చేశారని తెలిపారు.

ఏప్రిల్ 11న గంగదేవిపాడు గ్రామానికి చెందిన సిలివేరు నరసింహారావు వ్యక్తిగత పనిమీద బయటకు వెళ్లగా, ఆయన భార్య కూలి పనికి వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చిన నరసింహారావు ఇంటి వాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించారు. ఇంట్లోని ఇనుప బీరువాను కూడా పగులగొట్టి, అందులో భద్రపరిచిన బంగారు ఆభరణాలు చోరికి గురైనట్లు గుర్తించి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. దర్యాప్తులో భాగంగా నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించగా, గంగదేవిపాడు గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంటిని గుర్తించి, తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి ఇనుప బీరువాను పగులగొట్టి బంగారు ఆభరణాలను చోరీ చేసినట్లు వెల్లడించాడు.

అదేవిధంగా...తల్లాడ ఎస్సై ఎన్.వెంకటకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన నిందితుడి విచారణలో తల్లాడ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో నిందితుడు తల్లాడలో తాళం వేసి ఉన్న ఇంటిని గుర్తించి, ఇంటి తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించి రెండు బంగారు ఉంగరాలను చోరీ చేసినట్లు వెల్లడించాడని తెలిపారు. అనంతరం ఆ బంగారు ఉంగరాలను గన్నవరం ప్రాంతంలోని ఎస్.ఆర్. బంగారం దుకాణంలో విక్రయించినట్లు విచారణలో తెలిపారన్నారు.

**నిందితుడి నేర చరిత్ర**

దర్యాప్తులో నిందితుడికి గతంలో కూడా పలు చోరీ, ఇంటి దొంగతనం కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించామని, వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో అతనిపై నమోదైన పాత కేసుల వివరాలను సంబంధిత పోలీస్ రికార్డుల ద్వార పరిశీలించినట్లు,

నిందితుడి ప్రమేయం ఉన్న ఇతర ఆస్తి నేరాలను కూడా గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతోందన్నారు. స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలను పంచుల సాక్షుల సమక్షంలో చట్టపరమైన విధానంలో స్వాదీనం చేసుకుని, నిందితుడిని అరెస్ట్ చేసి వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం గౌరవ న్యాయస్థానం ఎదుట రిమాండ్ కు తరలించినట్లు చెప్పారు.

**తల్లాడ పోలీసుల విజ్ఞప్తి**

ప్రజలు ఇళ్లను ఖాళీగా ఉంచి బయటకు వెళ్లే సమయంలో విలువైన వస్తువులను ఇంట్లో బహిరంగంగా ఉంచకుండా తగిన భాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లే సమయంలో సొరుగువారికి సమాచారం ఇవ్వడం, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించడం ద్వారా చోరీలను నివారించవచ్చని తెలిపారు.

# ఎర్రుపాలెం అంతర్రాష్ట్ర సరిహద్దు వద్ద వాహన తనిఖీలు: ఏసీపీ సారంగపాణి





**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 21 (భద్రాద్రిన్యూస్ ):-**
ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లు మరియు ఇతర వాహనాల్లో ప్రయాణించే వారు సీటు బెల్ట్ ధరించాలని, వాహనాలకు సంబంధించిన చెల్లుబాటు అయ్యే ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని వైరా ఏసీపీ సారంగపాణి సూచించారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు, వైరా ఏసీపీ మధిర రూరల్ సీఐ, మధిర టౌన్ సీఐ, వైరా సీఐ, సబ్ డివిజనల్ ఎస్ఐలు మరియు పోలీసు సిబ్బంది ఎర్రుపాలెం రింగ్ సెంటర్‌లోని అంతర్రాష్ట్ర సరిహద్దు వద్ద వాహన తనిఖీలు నిర్వహించి, వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని తెలిపారు.రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని వాహనదారులకు విజ్ఞప్తి చేశారు.

# స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ స్కూల్ శ్రీనగర్‌లో వరలక్ష్మీ వ్రతం వేడుకలు







**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 21( భద్రాద్రి న్యూస్):-**
క్షీరసాగరంలో పుట్టి, వైకుంఠాన మెట్టి, అమృతకరిశాబ్ధి నుండి అనంతకోటి చంద్రకాంతులతో అవతరించిన దేవి శ్రీమహాలక్ష్మి. అమ్మవారిని ఈ శ్రావణమాసంలో రెండవ శుక్రవారం వరలక్ష్మీ వ్రతంగా పూజించుకుంటాం. ఈ వ్రత వేడుకను స్థానిక శ్రీనగర్ కాలనీలోని స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ స్కూల్‌లో అత్యంత భక్తి శ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో పుణ్యవ్రతాన్ని ఆచరించారు. ముందుగా ఒక మండపాన్ని ఏర్పాటు చేసి, మండపం పైన బియ్యం పిండితో ముగ్గు వేసి, శ్రీలక్ష్మీ దేవి పటాన్ని ఉంచి, కలశాన్ని ఏర్పాటు చేశారు. పూజా సామాగ్రినంతా సిద్ధం చేసుకొని, అమ్మవారిని షోడశోపచారాలతో పూజించారు. తొమ్మిది పోగుల తోరనమును చేతికి కట్టుకున్నారు. ప్రదక్షిణ నమస్కారాలు చేశారు. చిన్నారులకు వరలక్ష్మీ వ్రత ఔన్నత్యం దాని మహత్యం గురించి డైరెక్టర్ కొండా శ్రీధర్ రావు వివరిస్తూ మన సంస్కృతీ, సంప్రదాయాలలో భాగమైన వేడుకలలో స్త్రీలు మాత్రమే ప్రత్యేకంగా నిర్వహించే వేడుక వరలక్ష్మీ వ్రతమని తెలిపారు. అమ్మవారి అనురాగాన్ని, అనుగ్రహాన్ని విద్యార్థినులకు అందించుట కోసం పాఠశాలలో నిర్వహించామని తెలిపి, అందరికి శుభాకాంక్షలు తెలియజేసారు.

పాఠశాల డైరెక్టర్ కొండా క్రిష్ణవేణి పూజలో పాల్గొని, విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయల విలువలను తెలపడానికి, ముఖ్యంగా స్త్రీలకు మాత్రమే పరిమితమైన వరలక్ష్మీ వ్రతంలాంటి వేడుకలను విద్యార్థులకు ఆచరించి చూపుటకు ఇలాంటి పండుగలను నిర్వహించినట్లు తెలిపి, అందరికి వరలక్ష్మీ వ్రత పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.సురేష్ మరియు బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేసారు.

# దొడ్డ శేషు మరణం యాదవ సంఘానికి తీరని లోటు

**భౌతిక కాయానికి నివాళులర్పించిన మల్లి బాబు యాదవ్**



**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 21 (భద్రాద్రిన్యూస్ ):-**
అఖిల భారత యాదవ మహాసభ మాజీ ఖమ్మం నగర అధ్యక్షులు, పెయింటింగ్ వర్కర్స్ వ్యవస్థాపక అధ్యక్షులు, సీనియర్ నాయకులు దొడ్డ శేషు యాదవ్ మరణం యాదవ సంఘానికి తీరని లోటని, వారు లేని స్థానం పూడ్చలేనిదని, డిసిసిబి డైరెక్టర్, అఖిలభారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లి బాబు యాదవ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గురువారం రాత్రి అనారోగ్యంతో దొడ్డ శేషు యాదవ్ మరణించిన వార్త తెలుసుకున్న యాదవ సంఘం నాయకులతో పాటు మల్లి బాబు యాదవ్ ఖమ్మంలోని వారి స్వగృహానికి చేరుకొని శేషు యాదవ్ భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ అఖిల భారత యాదవ మహాసభ సీనియర్ నాయకులు కనక బండి పాండురాజు, కీర్తిశేషులుమీగడ కన్నయ్య, అమరబోయిన సైదయ్య , బోళ్ళ వెంకటేశ్వర్లు, గడ్డం మల్లికార్జునరావు లాంటి నాయకులతో ఖమ్మం పట్టణంలో యాదవ సంఘాన్ని బలోపేతం చేశారని, అదేవిధంగా పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షులుగా సుదీర్ఘకాలం పనిచేశారని, వారు చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ నాయకులు చంద్రకాని రమణ,42వ డివిజన్ నాయకులు తోడేటి లింగరాజు,కోడి లింగయ్య, దొడ్డ సురేష్ దొడ్డ నరసింహారావు తుపాకుల వెంకన్న,జె.శ్రీను, ఎ. గురుమూర్తి, ఎస్. వెంకన్న, కొండయ్యయాదవ్, దొడ్డ శ్రీను,దొడ్డ రమేష్, వల్లపు వీరయ్య జి లక్ష్మణ్, ఎండి ముజాయుద్దీన్, నయీమ్ , యాదవ సంఘం నాయకులు, పెయింటింగ్ వర్కర్స్ తదితరులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# ఇతరుల వాహనాలను అనధికారికంగా కుదువ పెడితే కఠిన చర్యలు

**హెచ్చరించిన ఖమ్మం 2 టౌన్ పోలీసులు**

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 21 (భద్రాద్రిన్యూస్ ):**

ఇతరుల వాహనాలను అనధికారికంగా కుదువ పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని టూ టౌన్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ తెలిపారు. ఖమ్మం అర్బన్, బల్లేపల్లికి చెందిన బైతా పార్ధు అనే యువకుడి యాజమాన్యంలోని స్విఫ్ట్ కారు టి ఎస్ 18 ఎఫ్ 8241 గుగులోత్ శ్రీనివాస్ (పాండురంగాపురం) రెండు రోజుల నిమిత్తం అద్దెకు కావాలని నమ్మించి తీసుకెళ్లాడు. అనంతరం దురుద్దేశంతో సదరు కారును యజమాని అనుమతి లేకుండా మూడ్ అశోక్ (బార్లగూడెం) వద్ద రూ. 90,000/- లకు కుదువ పెట్టాడు. మూడ్ అశోక్ కూడా సదరు కారు పార్ధుదని తెలిసి కూడా అక్రమంగా కుదువ పెట్టుకున్నాడు.

ఫిర్యాదుదారుడు తన కారును తిరిగి ఇవ్వమని అడగ్గా నిందితులు ఏమార్చుతూ వచ్చారు. ఈ క్రమంలో 10.08.2026 రాత్రి మూడ్ అశోక్ ఆ స్విఫ్ట్ కారు టి ఎస్.18 ఎఫ్ 8241 తో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. వాహనాన్ని తిరిగి ఇవ్వమని కోరినందుకు ఫిర్యాదుదారుడిని బెదిరింపులకు గురిచేశారు.

బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఖమ్మం ×× టౌన్ పోలీసులు త్వరితగతిన విచారణ చేపట్టి, నిందితులపై కేసు నమోదు చేసి లిస్విఫ్ట్ కారు టి.ఎస్18 ఎఫ్ 8241 ను రికవరీ చేశారు.

**పోలీసుల హెచ్చరిక ప్రజలకు విజ్ఞప్తి:**

సమాజంలో ఇటీవల కాలంలో ఇతరుల వాహనాలను యజమానులకు తెలియకుండా అద్దెకు తీసుకుని, మూడో వ్యక్తి వద్ద కుదువ పెట్టే ధోరణి పెరుగుతోంది. ఇది తీవ్రమైన నేరం. ఈ సందర్భంగా ప్రజలకు ఖమ్మం II టౌన్ పోలీసులు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేస్తున్నారు:

1. అనధికారిక లావాదేవీలు నేరం: వాహన యజమాని అనుమతి, సమ్మతి లేకుండా ఇతరుల వద్ద నుండి వాహనాలను కుదువ పెట్టుకోవడం లేదా అప్పుగా తీసుకోవడం చట్టరీత్యా తీవ్రమైన నేరం.
2. వాహన యజమానుల బాధ్యత: మీరు అనధికారికంగా ఎవరికైనా వాహనం ఇచ్చినప్పుడు, ఆ వాహనం ఏదైనా విద్రోహ చర్యల్లో లేదా నేరాల్లో (జతీఆఎఆఖ్రీ ఝుంవం) భాగమైతే, చట్టప్రకారం వాహన యజమాని కూడా జవాబుదారీ కావలసి వస్తుంది.
3. కఠిన చర్యలు తప్పవు: అనుమతి లేకుండా వాహనాలు కుదువ పెట్టుకున్న వారిపై, ఇచ్చిన వారిపై మరియు వారికి సహకరించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం.

# ఫోటోగ్రాఫర్ అనంతుల రాంబాబు గౌడ్ కు ప్రతిష్టాత్మక అవార్డు

**ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకల్లో మునిగేపల్లి ఫోటోగ్రాఫర్ రాంబాబు గౌడ్ సత్తా**

**ఖమ్మం ఫోటోగ్రఫీ కాంటెస్ట్‌లో మునిగేపల్లి అనంతుల రాంబాబుకు గౌడ్ ఘన సత్కారం**





**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు:21భద్రాద్రిన్యూస్**

ఆగస్టు 19 ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా అవార్డు దక్కించుకున్న మునిగేపల్లి ఫోటోగ్రాఫర్.

187 వ ప్రపంచ ఫోటోగ్రఫీ సెలబ్రేషన్స్ సందర్భంగా హుస్సేన్ ఖాన్ ఆర్ట్ ఫోటోగ్రఫీ వారు అత్యంత ప్రతిష్టాత్మకంగా తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఫోటోగ్రాఫర్ ల కు నిర్వహించిన ఖమ్మం ఫోటోగ్రఫీ కాంటెస్ట్ -2026 బహుమతి ప్రదానం మంగళవారం సాయంత్రం ఖమ్మం ఎన్జీవో భవనం నందు అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ కు చెందిన ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు. ఈ కాంపిటీషన్ లో ఇరు రాష్ట్రాలకు చెందిన 122 మంది పాల్గొని 1072 ఫోటోలు పోటీ పడి నట్టు నిర్వాహకులు హుస్సేన్ ఖాన్ తెలిపారు. ఈ పోటీలు ఫోటోగ్రఫీ పిక్టోరియల్(బ్లాక్ ఁ వైట్),కలర్, వెడ్డింగ్,ఫెస్టివల్,నేచర్, ప్రీ వెడ్డింగ్, 6 విభాగాల్లో పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా వచ్చిన అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్ల , వీడియో గ్రాఫర్ల అవసరం ఈ రోజుల్లో తమకు చాలా అవసరం ఉందని ఎన్నో కేసులు సాల్వ్ కావడానికి వారు తీసిన ఫోటోలు,వీడియోలు ఉపయోగపడ్డాయి అని అన్నారు. ఫోటోగ్రాఫర్ లు టెక్నాలజీ లో ఎపుడుకపుడుమెరుగు పరుచుకుంటూ ఫోటోగ్రఫీ రంగం లో అభివృద్ధి చెందాలని కోరారు.

ఈ పోటీల్లో ఖమ్మం జిల్లా,మునిగేపల్లి కి చెందిన ఫోటోగ్రాఫర్ అనంతుల రాంబాబు గౌడ్ ప్రీవెడ్డింగ్ విభాగం లో తీసిన " కాబోయే వధూవరులు ఇరువురు పడవలో ప్రయాణిస్తూ ఉన్నటువంటి ఫోటో " కు సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్,షీల్డ్ అవార్డ్ గెలుపొందారు. మంగళవారం ఖమ్మం లో జరిగిన ప్రపంచ ఫోటోగ్రఫీ వేడుకల సందర్భంగా ఖమ్మం అడిషనల్ డీయస్ పీ బొజ్జ రామానుజం చేతుల మీదుగా అవార్డ్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి అడిషనల్ డీసీపీ బొజ్జ రామానుజం హెచ్.కె.ఆర్ట్ ఫోటోగ్రఫీ వ్యవస్థాపకులు హుస్సేన్ ఖాన్, తెలంగాణ ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హుస్సేన్,వనమాల శ్రీనివాస చారి, ఖమ్మం జిల్లా ఫోటోఁ వీడియో గ్రాఫర్స్ అధ్యకుడు మార్గని వెంకట్ తదితరులు పాల్గొన్నారు. 187 వ ప్రపంచ ఫోటోగ్రఫీ వేడుకల సందర్భంగా నిర్వచిన పోటీల్లో అవార్డ్ గెలుచుకున్న అనంతుల రాంబాబు గౌడ్ ను ఖమ్మం జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు,హెచ్.కె. ఆర్ట్ ఫోటోగ్రఫీ వ్యవస్థాపకులు హుస్సేన్ ఖాన్, ప్రముఖ సీనియర్ ఫోటోగ్రాఫర్స్ మరియు మునిగేపల్లి గ్రామ సర్పంచ్ గంగా స్రవంతి-రవి గ్రామ పెద్దలు రామ వీరభద్రం ముక్కా వీరయ్య చౌదరి , ముక్కా శ్రీనివాస్ రామా పూర్ణ, కాసుల కృష్ణ దితరులు అభినందించారు

# పదేపదే గంజాయి సరఫరా చేసే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలి




**అఖిల భారత మానవ హక్కుల సంఘం**

**కొత్తగూడెం, ఆగస్టు 21 ( భద్రాద్రిన్యూస్ ):**

జిల్లాలో గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసులు మరింత కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్తవరపు జానకిరామ్, జిల్లా కార్యదర్శి పలకాల ధర్మారావు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తొలిసారి గంజాయి సరఫరా చేస్తూ పట్టుబడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు, బెయిల్‌పై బయటకు వచ్చి పదేపదే గంజాయి సరఫరాకు పాల్పడుతున్న వారిని గుర్తించి పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని, ఇప్పటికే బానిసైన వారికి వైద్య, పునరావాస సేవలు అందించాలని సూచించారు. గంజాయి సరఫరాదారులపై గతంలో నమోదైన కేసులను పరిగణనలోకి తీసుకుని పునరావృత నేరాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు. కార్యక్రమంలో పాయం నాగమణి, గోనె రేణుక, విజయ, వాల్మీకి కృష్ణ, శ్రీనివాస్, చింత రాములు, వజ్జా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల మంజూరు చేసిన ఘనత పువ్వాడ అజయ్ కుమార్ కే దక్కుతుంది

**మాజీ సుడా ఛైర్మన్ బచ్చు విజయ్ కుమార్**

**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 21 (భద్రాద్రిన్యూస్ ):-**



ఖమ్మం జర్నలిస్టులకు 23 ఎకరాల్లో ఇళ్ల స్థలాలు మంజూరు చేసి, అందుకు సంబంధించి జీవో జారీ చేసిన ఘనత మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కు గత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని మాజీ సుడా ఛైర్మన్ బచ్చు విజయ్ కుమార్ అన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించి, వారి చిరకాల కోరికను నెరవేర్చేందుకు పువ్వాడ అజయ్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకుని కృషి చేశారని గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పువ్వాడ అజయ్ కుమార్ మంత్రిగా ఉన్న సమయంలో 23 ఎకరాల భూమికి రాష్ట్ర కేబినెట్ నుంచి ఆమోదం తీసుకుని, ఆ స్థలాన్ని హౌసింగ్ సొసైటీకి బదలాయిస్తూ జీవో జారీ చేయించారని వివరించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జర్నలిస్టుల సంక్షేమం విషయంలో విఫలమైందని గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పువ్వాడ తీసుకున్న చొరవ చేసిన కృషి ఫలితంగా మంజూరైన ఇళ్ల స్థలాలను జర్నలిస్టులకు కేటాయించే ప్రయత్నం కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చేయలేదని ఆరోపించారు.

జర్నలిస్టుల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో కృషి చేసిన ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమే అని ఖమ్మం జిల్లాలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మాత్రమేనని స్పష్టం చేశారు. జర్నలిస్టుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వంలో పువ్వాడ అజయ్ కుమార్ ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు.

## కోనారెడ్డి చెరువు అభివృద్ధికి రూ.3.14 కోట్లు

**వచ్చే ఏడాదికల్లా రైతులకు నీరు అందించాలి**

**ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

వర్ధన్నపేట కేంద్రంలోని కోనారెడ్డి చెరువు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గురువారం శంకుస్థాపన చేశారు. రూ.3.14 కోట్ల నిధులతో చేపట్టనున్న పనులను వేగంగా, నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాదికల్లా కాలువల ద్వారా రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

అనంతరం వర్ధన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఎమ్మెల్యే సందర్శించారు. విద్యార్థులకు 30 కుర్చీలు, 5 టేబుళ్లు, 3 ఉపాధ్యాయుల కుర్చీలను అందజేశారు. త్వరలో ఫ్యాన్లు, లైట్లు కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. పేద విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో మండలపార్టీ అధ్యక్షుడు పోషాల వెంకన్న గౌడ్, పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్, మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, ఐనవోలు టెంపుల్ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ శిభారాని రాజేందర్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు భాను ప్రసాద్,కుల్లా యాకాంతం తదితరులు పాల్గొన్నారు.



భద్రాద్రి న్యూస్

శుక్రవారం 21,ఆగస్టు, 2026

# ధిక్కారపు ఉచ్చు






మొదటి పేజీ తరువాయి

ములుగు జిల్లాలో విపత్కరమైన పరిస్థితులు నెలకొన్నాయి. రాజ్యాంగబద్ధంగా కోర్టుల గౌరవాలను కాపాడుతూ పనిచేయాల్సిన ఉన్నతమైన స్థాయిలో ఉన్న అధికారులు రాజకీయకబంధహస్తాల్లో చిక్కుకొని ప్రజాస్వామ్య వ్యవస్థకు మాయని మచ్చ తెస్తున్నారు. ప్రధానంగా ములుగు జిల్లాలో ఇసుక మాఫియా ఆగడాలకు రాజకీయ పెద్దలు అధికార పార్టీ ప్రముఖులు అండదండల పుష్కలంగా ఉండడంతో ఇక్కడ అనైతికంగా సాగుతున్న కార్యకలాపాలకు అడ్డు అదుపు లేకుండా పోతుంది.. జిల్లాలోని గోదావరి నదిలో ఇసుక పూడికతీత పనుల పేరుతో సాగుతున్న అక్రమాలకు వ్యతిరేకంగా కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఇటీవల కోర్టు తవ్వకాలు నిలుపుదల చేయాలని స్టే ఇవ్వడం జరిగింది. అయితే కోర్టు ఉత్తర్వులను అమలుపరచాల్సిన అధికారులు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నది తాజాగా స్పష్టమైంది. కోర్టు స్టే ఇచ్చినప్పటికీ తవ్వకాలు ఆగలేదంటూ సాక్షాత్త పిటిషనరే కోర్టు దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలో ములుగు జిల్లాలోని ఉన్నతాధికారులు రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్న వ్యవహారం వెలుగులోకి వచ్చింది. తవ్వకాలకు సంబంధించిన ఆదేశాలను ధిక్కరించి తిరిగి తవ్వకాలు చేస్తున్నారనే విషయాన్ని సీరియస్ గా తీసుకున్న న్యాయస్థానం తవ్వకాలకు సంబంధించిన ఫోటోలను దాఖలు చేయాలని ఆదేశాలు చేయడం ప్రస్తుతం చర్చినీ యాంశంగా మారింది. ములుగు జిల్లా అధికారుల పర్యవేక్షణ లోపం పట్టించుకోని తనం వల్లే గోదావరిలో పూడికతీత తవ్వకాలు తిరిగి జరుగుతున్నాయని వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీంతో రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి ఉన్నతమైన స్థానంలో ఉన్న అధికారి సైతం కోర్టు ఉత్తర్వులను అమలుపరిచేలా చర్యలు తీసుకోవ డం లేదని స్పష్టమవుతుంది. కోర్టు నిర్ణయాన్ని ధిక్కరిస్తూ ఇసుక మాఫియా గోదావరిలో తవ్వకాలు చేయడం ఖచ్చితం గా ములుగు జిల్లాలోని సంబంధిత అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కోర్టులను సైతం గౌరవించలేని స్థాయికి అధికారులు వెళ్లిపోయా రా అనే ప్రశ్నల వ్యక్తం అవుతున్నాయి. నిజానికి ములుగు జిల్లాలో ఇసుక అక్రమాల వెనుక జిల్లా స్థాయి అధికారుల పాత్ర ఉందనేది ప్రచారంలో ఉంది.. ఈ జిల్లాలో ఇసుక ర్యాంపుల నిర్వహణ ఓ ప్రముఖ నాయకుని కనుసన్నల్లోనే జరుగుతున్నాయని దానికి జిల్లా స్థాయి అధికారి ఆశీస్సులు ఉన్నాయనే విమర్శలు సైతం ఉన్నాయి. అయితే వివాదం కోర్టు పరిధిలోకి వెళ్ళాక కూడా న్యాయస్థానం ఒక నిర్ణయం ప్రకటించాక ఆ నిర్ణయాన్ని అమలు చేయాల్సిన అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరించడం వెనక ఆంతర్యం ఏమిటి అనేది ప్రశ్నార్థకంగానే మిగులుతుంది..

### కలెక్టర్ గారూ... పట్టించుకోరా మీరు

ములుగు జిల్లాలో గోదావరి నదిలో ఇసుక పూడికతీత వ్యవహారంలో కోర్టు ఇచ్చిన తీర్పుకు విరుద్ధంగా తిరిగి తవ్వకాలు చేస్తున్నారంటూ వచ్చిన ఆరోపణ నేపథ్యం లో ములుగు కలెక్టర్ ఈ వ్యవహారంలో ఎలా స్పందిస్తారని చర్చలు సాగుతున్నాయి. కోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయని కోర్టు దృష్టి కే వెళ్లిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లా బాస్ గా కోర్టు ఉత్తర్వులను తూచా తప్పకుండా ఖచ్చితంగా అమలు చేయాల్సిన బాధ్యత కలిగిన ఆయన అవి అమలు కావడం లేదంటూ తెలిసాక కూడా స్పందించకపోతే ధిక్కారపు ఉచ్చులో చిక్కుకోవాల్సిన పరిస్థితులు ఎదురవుతాయి. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి రాజ్యాంగబద్ధమైన పనితీరుకు విరుద్ధంగా వ్యవహరిస్తే కోర్టు ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరిఈ వ్యవహారంలో కలెక్టర్ ఎలా స్పందిస్తారు ఏమి చెప్తారో వేచి చూద్దాం

# డిషిల్టేషన్ వివాదంలో ప్రభుత్వానికి షాక్

- ఎన్జీటీ స్టేను పొడిగించిన న్యాయస్థానం
- కౌంటర్ దాఖలకు ప్రభుత్వం అనుమతి
- అయినా సరే స్టేను పొడిగిస్తూ నిర్ణయం
- కోర్టుకు హాజరైన అదనపు అడ్వకేట్ జనరల్
- స్టే ఉన్న తవ్వకాలు ఆగడం లేదంటూ పిటిషనర్ ఫిర్యాదు
- ఫోటోలు దాఖలు చేయాలంటూ న్యాయమూర్తి ఆదేశం




భద్రాద్రి న్యూస్ ములుగు జిల్లా : ములుగు జిల్లాలో గోదావరి నదిలో ఇసుక పూడికతీతకు సంబంధించిన వివాదంపై ఎన్జీటీ స్టేను పొడిగిస్తూ కోర్టు నిర్ణయం తీసుకుంది. గతంలో స్టే ఇచ్చిన సందర్భంలో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయలేదు., ఈ మేరకు డి సిల్టేషన్ పై కోర్టుకు హాజరైన ప్రభుత్వ అదనపు జనరల్ అడ్వకేట్ కౌంటర్ దాఖలకు అనుమతి కోరినప్పటికీ కోర్టు కేసును సెప్టెంబర్ 18 కు వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకోవడం విశేషం. అయితే పూడికతీతకపై కోర్టు స్టే ఉన్నప్పటికీ ఇసుక తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకువెళ్లడంతో తవ్వకాలకు సంబంధించిఫోటోలు దాఖలు చేయాలంటూ కోర్టు ఆదేశించడంతో డి శిల్టేషన్ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. కోర్టు స్టేను సైతం ధిక్కరిస్తూ గోదావరిలో పూడికతీత జరుగుతూనే ఉందంటూ కోర్టు దృష్టికి వెళ్లిన నేపథ్యంలో ములుగు జిల్లా అధికారుల పనితీరుపై విమర్శలు వెలువెత్తుతున్నాయి.